క్లుప్తంగా

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : ఈ నెల 17వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. విధిగా మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో గతంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై అధికారుల వివరణతో పాటు అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు


కె.వెంకటాపురంలో పారిశుధ్యం పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లు గ్రామంలోని చెత్తను సేకరించి వీధులను శుభ్రం చేశారు. డ్రైనేజీలలో పూడిక తీసి వీధుల్లో చెత్తను తొలగింపజేశారు. మురుగు కాలువలపై బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉన్నందున పరిశుభ్రత శ్రద్ధ వహించాలన్నారు. దోమల వ్యాప్తితో డెంగ్యూ జ్వరాలు కూడా ఎక్కువగా వస్తున్నాయని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. గంగాదేవిపేటలో శనివారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. శిబిరానికి ఆరోగ్య అధికారి నాగమణి వైద్య సేవలందించారు. ఏఎన్ఎం యామిని, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్ లత పాల్గొన్నారు.

17న అరబుపాలెంలో ఆరోగ్య సురక్ష


అరబుపాలెంలో వైద్య శిబిరం ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

మునగపాక : అరబుపాలెం గ్రామంలో ఈ నెల 17న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం విజయవంతమయ్యేలా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ కోరారు. శనివారం ఆయన సురక్ష శిబిరం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో వైద్యం అందించేందుకు వీలుగా గదులు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. టోకెన్లు తీసుకున్న ప్రతి ఒక్కరూ శిబిరానికి వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, పంచాయతీ కార్యదర్శి రమణ, వైద్య సిబ్బంది ఆయన వెంట పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఎస్.రాయవరం పాఠశాల విద్యార్థులు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీలకు నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. గడిచిన శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇందిరాగాంధీ ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. అండర్ 14 విభాగంలో కె.ఫణీంద్ర, కె.వాణిదుర్గ, అండర్ 17 విభాగంలో కె.కావ్య, కె.ప్రసాద్ ఎంపికయ్యారన్నారు. వీరంతా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు


పాల్మన్‌పేటలో ఏర్పాటైన ఇంటింటి కుళాయిలు


గ్రామాల్లో తాగునీటి సరఫరా పనులు

పాయకరావుపేట : మండలంలో చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలోను, ప్రతి ఇంటికి తాగునీరు సరఫరాకు కుళాయిలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా మండలంలో గల 24 గ్రామాల్లోను పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రక్షిత తాగునీరు విభాగం అధికారులు అందించిన వివరాల ప్రకారం మండలంలో గల 24 గ్రామాలకు గాను తాగునీరు సరఫరా సమస్య పరిష్కారానికి మొదటి దఫాగా రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. రెండో విడతలో మరో రూ.20 కోట్లు మంజూరయ్యాయి. 20 పనులు చేపట్టుటకు మంజూరైన రూ. 20 కోట్లలో రూ.6 కోట్లు పాయకరావుపేట గ్రామానికి మంజూరయ్యాయి. అదే విధంగా మండలంలో 23 వేల ఇళ్లకు కుళాయిలు వేయాల్సి ఉండగా ఇంతవరకు 10 వేల కుళాయిలు ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలో గల ఆయా గ్రామాల్లో 15 వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో ఇంతవరకు పి.ఎల్.పురం గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.85 లక్షలతో ట్యాంక్ నిర్మించారు. కుమారపురం గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.43లక్షలతో ట్యాంకు నిర్మించారు. మొదటి విడతగా మంజూరైన నిధులతో 90 శాతం పనులు పూర్తయ్యాయి. రెండో దఫాగా మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో పైపులైనులు, వ్యాటర్ ట్యాంకు నిర్మాణ పనులు, కుళాయిల ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

ఆటో పార్కింగ్ స్థలాలు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆటోమోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రెహమాన్

యలమంచిలి : పట్టణంలో ఆటో అండ్ మోటార్ వాహనాల వర్కర్స్‌కు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ కోరారు. శనివారం యలమంచిలి పట్టణంలో జరిగిన జిల్లా ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో గజిట్ నోటిఫికేషన్ 894 తీసుకుచ్చి జరిమానాలు పెంచిందన్నారు. 21, 31జీవోలు తీసుకువచ్చి ఆటో మోటార్ రంగాల కార్మికులపై ఆర్టీఏ, పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఆటో మోటార్ రంగ కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 21, 31 జీవోలను రద్దు చేసి కార్మికుల భద్రత కల్పించాలని, రోజువారీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. యలమంచిలి పట్టణ ప్రాంతాల్లో ఆటో మోటార్ వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్త ఆటో మోటార్ వాహనాల వర్కర్స్ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు,ఆటో యూనియన్ నాయకులు ఎ.నాగు, బి.అప్పలనాయుడు, గొర్లె రాము, పి. నూకేష్ పాల్గొన్నారు.

చెడుగుడు పోటీల విజేత కొండకర్ల జట్టు

రాంబిల్లి : మూలకొత్తూరులో నిర్వహించిన జిల్లా స్థాయి చెడుగుడు పోటీల్లో మూలకొత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో ఎం. జగన్నాథపురం జట్టు నిలిచింది. విజేతకు రూ.8116 ను సర్పంచ్ నీరుకొండ శారద సూర్యనారాయణ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన జగన్నాథపురం జట్టుకు నీరుకుండ సూరిబాబు రూ.6116 అందజేశారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

ఎస్.రాయవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్ర మూర్తి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరగాల్సిన సమావేశానికి సభ్యులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్టు చెప్పారు. తదుపరి సమావేశం తేదీ ప్రకటిస్తామన్నారు.

నేటి నుంచి దేవీ నవరాత్రులు


నవరాత్రి మహోత్సవాల కోసం సిద్ధమవుతున్న అమ్మవారి విగ్రహాలు


పందిళ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


దిమిలిలో బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

నక్కపల్లి: దేవీ నవరాత్రులు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభంకానున్నాయి. తొమ్మిది రోజుల పాటు దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నక్కపల్లి, దేవవరం, ఉద్దండపురం కాగిత చినదొడ్డగల్లు, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబాన వాని పాలెం, సీహెచ్‌ఎల్ పురం, గొడిచర్ల, తదితర గ్రామాల్లో అమ్మవారి ఉత్సవాల కోసం ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక కుంకుమ పూజలతో పాటు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

యలమంచిలి : దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో ప్రత్యేక మండపాలు, ఆలయాలు ముస్తాబయ్యాయి. పేట బయ్యవరం గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణలు, వివిధ పూలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. యలమంచిలి పట్టణం నుంచి దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో మేళ తాళాలతో ఊరేగింపుగా భక్తులు తీసుకువెళ్లారు. పలు గ్రామాల్లో ప్రజలు దుర్గాదేవి మాలలు ధరించి నియమ నిష్ఠలతో పూజలు చేయాడానికి సిద్ధమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో పట్టణంతో పాటు మండలం అంతా ప్రత్యేక శోభ సంతరించుకుంది.

రాంబిల్లి : గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల శోభ నెలకొంది. ఆదివారం నుంచి ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దిమిలిలో బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారిని శనివారం రాత్రి ఊరేగింపుగా తీసుకువచ్చారు. భవానీ మాలధారణ చేసిన భక్తులు, దుర్గాదేవి భక్తులు అమ్మవారి శరణుగోషతో భజనలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

భగీరథమ్మ ఆలయంలో..

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం–అందలాపల్లి భగీరథమ్మ వారి దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు కొండపైన ఆలయం ముందు పందిళ్లు, ఇతరత్రా పనులను పూర్తి చేశారు. ఆలయ మండపంలో భవానీ మాలధారణ భక్తులు, అయ్యప్ప మాలధారణ భక్తులు అమ్మవారికి పూజలు చేయనున్నారు. ప్రతి రోజూ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ బుద్ధ సత్య వెంకట్ రామ్ తెలిపారు. కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, కోశాధికారి సూరిసెట్టి గాంధీ ఏర్పాట్లు శనివారం పరిశీలించారు.

నూకాంబిక అమ్మవారికి ఘనంగా అమావాస్య పూజలు


ఉపారం తీసుకువెళుతున్న కొణతాల మురళీకృష్ణ, కంభంపాటి భాను దంపతులు

అనకాపల్లిటౌన్: అన్నిదానాలు కన్న అన్నదానం గొప్పదని నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. గవరపాలెం అమ్మవారి ఆల యం వద్ద ఆదిబాబు అమావాస్య యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం ఘనంగా అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది దసరా నవ రాత్రులను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంభంపాటి భాను దంపతులు బూరెలు, వడలు, పులిహోర, పరమాన్నం, అరిసెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించినట్టు ఆయన చెప్పారు. అమ్మవారికి ఉపారం పెట్టిన అనంతరం దాతలు పిళ్లా తారకేష్, బుదిరెడ్డి నాగరాజు, జగడాల పురుషోత్తం సహకారంతో మధ్యాహ్నం 1200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొణతాల మురళీకృష్ణ ప్రారంభించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు పీలా లక్ష్మీశ్రీనివాస్, కొందూరు రవీంద్రనాథ్, బుద్ద నరసింగరాజు, మల్లవరపు ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

భారీ ఎత్తున అన్నసమారాధన

అనకాపల్లిటౌన్: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ సిద్ధిలింగేశ్వరస్వామి దేవాలయంలో వాసవీ స్వయం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయం చైర్మన్ సుదురు పాటి తాతాజీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు దేవాలయంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్తీకమాసంలో సిద్ధలింగేశ్వర స్వామి ఆలయంలో గోకర్ణేస్వారస్వామికి ప్రత్యేకపూజలు జరపనున్నట్టు చెప్పారు. శరన్నవరాత్రుల సందర్భంగా దేవాలయంలో కాశీ అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ


నూతన కమిటీతో క్లబ్ సీనియర్ సభ్యులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాసవీక్లబ్ అధ్యక్షుడిగా కె.వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో శనివారం ఎన్నికలు జరిగాయి. క్లబ్ కార్యదర్శిగా బిళ్లపాటి గణేష్ గంగరాజు, కోశాధికారిగా దంగేటి సత్యనారాయణ(మామాజీ)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. 2024లో క్లబ్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులతో చర్చించనున్నట్టు తెలిపారు.

నేడు ఆంధ్ర పద్యకవితా సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆంధ్రపద్యకవితా సదస్సు నిర్వహించనున్నట్టు సదస్సు జిల్లా అధ్యక్షుడు మెరుగుమిల్లి వెంకటేశ్వరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ కె.వి.సత్యవతి పాల్గొనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

తుమ్మపాల: ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా పంచా యతీ అధికారి ఆర్.శిరీషారాణి శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చేతుల పరిశుభ్రతపై ప్రజల్లో క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగించేలా ర్యాలీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మాడుగుల రూరల్: బాల్య వివాహాలు వద్దని, వీటి వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని శనివారం జాలంపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్(సీడ్) ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ ర్యాలీ చేపట్టారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనేక అనారోగ్యపరమైన సమస్యలు వస్తాయని సర్పంచ్ గణతూరి దారమల్లేశ్వరి తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గణతూరి చిన్ని పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు సిద్ధం

రోలుగుంట: జగనన్న గోరుముద్ద పథకం కింద మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేయనున్నట్టు ఎంఈవో–1 జానుప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో వాటిని అకౌంటెంట్ శ్రీనివాసరావుతో కలిసి లెక్కించారు. ఈ సందర్భంగా ఎంఈవో –2 జగ్గారావు వీటిని ఎ,బి,సి,డి,ఈ,ఎఫ్ ప్రాతిపదికన ఆయా పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

నేడు మార్కెట్‌యార్డు ప్రారంభం


రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన మార్కెట్‌యార్డు

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన మార్కెట్‌యార్డును ఆదివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మునగపాక సంతబయిల వ్యాపారులకు అనువుగా ఉండేలా లారస్ ల్యాబ్స్ ఆర్థిక సహకారంతో మార్కెట్‌యార్డులో షెడ్లు ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు అతిథిగా హాజరుకానున్నారు. లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా కోలాటం, చిటికల భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అప్పారావు కోరారు.

25 నుంచి అయ్యప్ప మాలధారణలు


మాట్లాడుతున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు

మునగపాక : మునగపాకలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి అయ్యప్ప మాలధారణలు జరగనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ వేగి లక్ష్మణరావు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఏటా గ్రామస్తుల సహకారంతో అయ్యప్ప మాలలు ధరించిన భక్తులతో పాటు ఇతరులకు కూడా అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామని ఈ ఏడాది కూడా అదే పరంపర కొనసాగిస్తామని అన్నారు. సుబ్రహ్మణ్య షష్టి వరకు అన్నదానం కొనసాగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో జెడ్‌పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, కమిటీ సభ్యులు మొల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి రాము, వెలగా శ్రీనివాసరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి కాశిబాబు, కిరణ్, వెంకటప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోటీలకు ఏర్పాట్లు


ఖోఖో పోటీలకు ముస్తాబైన మైదానం

పాయకరావుపేట : సి.బి.ఎస్.ఈ. క్లస్టర్ –7 ఖోఖో పోటీలు నేటి నుంచి (15,16,17) తేదీలలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో జరగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. పోటీలకు ఆంధ్రా, తెలంగాణా సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 100 టీమ్‌లు, 1200 మంది విద్యార్థులు అండర్ 19 బాలుర, బాలికల విభాగంలో పాల్గొననున్నారని ఆయన తెలిపారు. ఈ ఆటల పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, మొత్తం 4 కోర్టులను ఆటల పోటీలకు అందుబాటులో ఉంచామని, రాత్రి పూట కూడా ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఏకాగ్రతతో పోటీ పరీక్షల్లో రాణింపు


మాట్లాడుతున్న విశ్రాంత డీఈవో తమ్మిరాజు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని పోటీ పరీక్షల్లో రాణించాలని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఏటా క్రమం తప్పకుండా సంస్థ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు డైరెక్టర్ ఎం.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. సంస్థ సభ్యులు కె.వి.రమణ, కొణతాల సోమశేఖర్, ఆడారి సతీష్‌కుమార్, శివకోటి దుర్గా ప్రసాద్, పిల్లా జగదీష్, మాడెం జోగారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెజ్ ప్రభావిత ప్రాంత సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు, సెజ్ ప్రభావిత ప్రాంతాల గ్రామాల దీర్ఘకాలిక సమస్యల్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిష్కరించాలని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు. ఈ మేరకు శనివారం అచ్యుతాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న సీఎం అచ్యుతాపురం సెజ్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసినప్పుడు ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరారు. కనీస వేతనాలు, గ్రామాల తరలింపు, పరిహారం పంపిణీ అంశాలపై సీఎం దృష్టి సారించి సెజ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.సోమునాయుడు, దేముడు నాయుడు, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

చమ్మచింతలో అమూల్ పాలకేంద్రం ప్రారంభం


అమూల్ పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మైనం శ్రీనాగ గోపి

నాతవరం: ప్రభుత్వం పాడి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక చర్యలు చేపడుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగ గోపి తెలిపారు. జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా శనివారం చమ్మచింతలో ఏర్పాటు చేసిన అమూల్ పాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడమే కాకుండా అదనంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాజకీయాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా వీటిని అందించి వైఎస్సార్‌సీపీకి మరింత మద్దతు చేకూర్చారన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో సైతం కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడంతోపాటు ఎమ్మెల్యే గణేష్‌ను మరలా గెలిపించాలన్నారు. అమూల్ పాల కేంద్రానికి పాలు సరఫరా చేసే రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని పాల ఉత్పత్తి పెంచాలన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జోరుగా విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగ్

రోలుగుంట: విద్యుత్ మీటర్ నంబర్లకు వినియోగదారుల ఆధార్ సీడింగ్ ప్రక్రియ ఆ శాఖ ఉద్యోగులు చేపట్టారు. ఈ మేరకు మండల విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభం ఆదేశాల మేరకు గ్రామాల్లో వినియోగదారుల ఇళ్లకు వెళ్లి ముందుగా మీటరు నంబర్ యజమాని పేరు సరిపోల్చుకొని వారి ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా రోలుగుంటలో 1,500 మీటర్లకుగాను 1,200 మీటర్లకు అసిస్టెంట్ లైన్‌మన్ శ్రీనివాసరావు, సహాయకుడు రాంబాబు శనివారం ఆధార్ సీడింగు చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి మిగిలిన వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.